క్లుప్తంగా

నేడు ప్రజావేదిక

గుర్ల: ఉపాధి హామీ పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్ నివేదికలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల స్థాయి ప్రజావేదిక మంగళవారం నిర్వహించనున్నట్లు ఉపాధి హామీ ఏపీఓ కె.కామేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన చెరువు పనులు, ఇతర అభివృద్ధి పనులపై ఇటీవల ఆడిట్ పూర్తయిందని పేర్కొన్నారు. గ్రామాల వారీగా సిద్ధం చేసిన నివేదికలపై మండల స్థాయి ప్రజావేదికలో చర్చించనున్నట్లు స్పష్టం చేశారు. ప్రజావేదిక సభకు ఉపాధి హామీ పథకం పీడీ హాజరు కానున్నారని తెలిపారు.

క్షయపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బొండపల్లి: ప్రాణాంతక క్షయ(టీబీ)వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ అన్నా రు. ప్రపంచ క్షయదినం సందర్భంగా బిల్లలవలస గ్రామస్తులకు, అక్కడి పాఠశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈసంద ర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు,జ్వరం,బరువు తగ్గడం, ఆకలి మందగించడం, కఫం ద్వారా రక్తపు జీరలు పడటం వంటి లక్షణాలు ఉంటే క్షయ కావచ్చని, ఆలస్యం చేయకుండా వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ఏ.బాషా, ఏఎన్ఎం పైడితల్లి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన



కేజీబీవీ ప్రాంగణంలో ఆర్జేడీ విజయభాస్కర్, తదితరులు

గజపతినగరం: మండలంలోని మరుపల్లి కస్తుర్బా గాంధీ బాలికల విద్యాల యాన్ని (కేజీబీవీ) ఆర్జేడీ బి.విజయభాస్కర్ సోమవా రం సందర్శించారు.పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, వసతులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థినుల సంఖ్య, పదోతరగతి విద్యార్థినులు ఏవిధంగా పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారని ఉపాధ్యాయినులను ఆరా తీశారు. విద్యా ర్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ -2 బి.సాయిచక్రధర్, కేజీబీవీ ఎస్ఓ ఆర్.హైమ, తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంస



డీఎంహెచ్ఓ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ అజయ్‌కుమార్

వేపాడ: విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అజయ్‌కుమార్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి(డీఎంహెచ్ఓ) ఎస్.జీవనరాణి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన వైద్య సిబ్బందిని డీఎంహెచ్ఓ అభినందించి, ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. ప్రశంసా పత్రం అందుకున్న డాక్టర్ అజయ్‌కుమార్‌కు వేపాడ పీహెచ్‌సీ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలలో తనిఖీలు



విద్యార్థినులతో పాఠ్యాంశాలు చదివిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని పెదగుడిపాల ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ బాలభాస్కరరావు సోమ వారం తనిఖీలు చేశారు. పాఠశాలలో తరగతి గదులు, పరిసరాలు, కిచెన్ గార్డెన్‌ను, విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించి పథకం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

జెడ్పీ నిధులతో బోరు ఏర్పాటు

వేపాడ: శింగరాయి గ్రామంలోని ఎస్సీ కాలనీలో జిల్లా పరిషత్ నిధులతో హ్యాండ్ బోరు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి తెలిపారు. గ్రామంలో బోరు డ్రిల్లింగ్ పనులు సోమవారం చేపట్టా రు. సర్పంచ్ వెంకటరావు, సామాజిక కార్యకర్త అప్పారావు వినతికి స్పందించి జిల్లా పరిషత్ నుంచి నిధులు మంజూరుకు జెడ్పీటీసీ ఎస్.అప్పారావు కృషి చేశారు. బోరు ఏర్పాటు చేస్తుండడంతో కాలనీ వాసులు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావుకు, జెడ్పీటీసీ అప్పారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

అద్దె భవనాల్లో అవస్థలు



శిథిలమైన భవనంలోనే అద్దెకు నడస్తున్న ఎక్సైజ్ శాఖ కార్యాలయం



అద్దె భవనంలో నడుస్తున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



అరకొర వసతుల మధ్య నడుస్తున్న పోస్టాఫీస్

కొత్తవలస:

మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో కునారిల్లుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్న కొత్తవలస మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించేందుకు మాత్రం స్థలాలు లేవన్నట్లు పాలకులు, అధికారులు వ్యవహరిస్తు న్నారు. ఏళ్ల తరబడి వేల రూపాయల అద్దెలు చెల్లిస్తూ, కనీస సౌకర్యాలు లేని భవనాల్లో కాలం వెల్లదీస్తున్నా రు.మండల కేంద్రంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, పోస్టాఫీస్, ఎక్సైజ్ శాఖ కార్యాలయం, వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయం, శాఖా గ్రంథాలయం, జిల్లా సహకార సంఘం బ్యాంకు, తదితర ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.అద్దె భవనాల్లో వసతుల లేమి వల్ల ఉద్యోగులతో పాటు ఆయా కార్యాలయాలకు పనుల మీద వచ్చే ప్రజలు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నీటి పారుదలశాఖ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర కార్యాలయాలకూ సొంత భవనాలు లేవు. వీటిని ఇతర శాఖలకు సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఓ మూలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేలా కృషి చేయాలని ఆయా కార్యాలయాల సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

చీపురుపల్లి: స్థానిక వంద పడకల ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు వైద్యసిబ్బందికి సూచించారు. ఏరియా ఆస్పత్రిలో సోమవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ముందుగా ఆస్పత్రిలో ఓపీ గదులు, ల్యాబొరేటరీ, ఎమర్జెన్సీ, సాధార ణ వార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యులతో సమీక్ష నిర్వహించారు.రోజూ నమోదవుతున్న ఓపీ, నెలవారీ జరుగుతున్న ప్రసవాలు, శస్త్ర చికిత్సలు తదితర, వసతి సదుపాయాలు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ఓపీ పరీక్షలు చేసేందుకు గదులు ఇరుకుగా ఉన్నాయని, సాధారణ శస్త్ర చికిత్సలకు అవసరమైన ఆపరేషన్ థియేటర్ లేదని, పూర్తి స్థాయిలో వీల్ ఛైర్స్ లేవని, బ్లడ్ బ్యాంక్‌కు ఇన్వర్టర్లు అవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నిధుల తో తక్షణమే బ్లడ్ బ్యాంక్‌కు ఇన్వర్టర్లు కొనుగోలు చేయాలని ఆదేశించారు.ఏప్రిల్‌లో ఆస్పత్రి అభివృద్ధికి నిధులు విడుదల కానున్నాయని, పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మెంబర్లు డాక్టర్ ఆర్.విజయసారధి, ఇజ్జరోతు రాంబాబు, వెంపడాపు లక్ష్మునాయుడు, ఆరతి సాహు, కూటమి నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, విజనగిరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

చీపురుపల్లిరూరల్(గరివిడి):

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, చెడు వ్యసనాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్ద ని చీపురుపల్లి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు సివిల్ జడ్జి వై.ప్రేమలత అన్నారు. గరివిడి అవంతి సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ అధ్యక్షతన న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు.అతిథిగా హాజరైన జడ్జి ప్రేమలత పోక్సో, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎవరైనా ఆడపిల్లలను వెంబడించినా, వేధించినా, ఫోన్ ద్వారా అసభ్యకరంగా మెసేజ్‌లు పెట్టినా, ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులంతా నైతిక విలువలను పెంపొందించుకోవాలని, ఉన్నత భవిష్యత్ కోసం మంచి లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు మాట్లాడుతూ పోక్సో చట్టం 18 ఏళ్ల లోపు ఆడపిల్లలకు రక్షణ కల్పిస్తుందని చెప్పారు. ప్రేమ పేరుతో మోసం చేయడం, ఆడపిల్లలపై లైంగిక దాడి, అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. సీఐ శంకరరావు మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాలో ఫొటోలు,వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గీతామందిర్ బోధకులు గీతాప్రకాష్, చీపురుపల్లి కోర్టు బార్ అసోసియేషన్ సెక్రటరీ నాగభూషణరావు, న్యాయవాది రఘు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న జడ్జి ప్రేమలత

చెరువు గట్టు తవ్వి రోడ్డు నిర్మాణం..!

కొత్తవలస:

నిమ్మలపాలెంలో కూటమి నాయకులు ఆగ్రామ సమీపంలోని రావి చెరువు గట్టును తవ్వి రోడ్డు పనులు చేపడుతుండడంపై గ్రామానికి చెందిన కొంతమంది రైతులు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో ఎల్.కోట,ఎస్.కోట సెక్షన్‌ల నీటిపారుదలశాఖ జేఈలు హనుమంతురావు, శివరామకృష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.చెరువు గట్టుతవ్వి రోడ్డు వేయడాన్ని, చెరువుకు కొండ నుంచి నీరు వచ్చే కాలువలో గోడకట్టడాన్ని గుర్తించారు.జేఈ హనుమంతురావు మాట్లా డుతూ చెరువు గట్టు తవ్వి రోడ్డు వేయడం తగద ని అన్నారు.గట్టు ఎంతమేర ఉందో సర్వే చేసి గుర్తిస్తామని తెలిపారు. పంచాయతీ రాజ్, రెవెన్యూ, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా ఈ పనులపై విచారణ చేస్తాయని చెప్పారు. ఆరోపణలు రుజువైతే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని అన్నారు.అలాగే మరో ప్రాంతంలో గెడ్డలో నిర్మిస్తున్న రోడ్డును పరిశీలించారు.రోడ్డుకు సంబంధించి పనుల మంజూరు పత్రాలను చూపించాలని పనులు చేయిస్తున్న వ్యక్తిని అడగగా, పత్రాలను తర్వాత చూపిస్తానని ఆ వ్యక్తి అధికారులకు బదులిచ్చారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నీటిపారుదలశాఖ జేఈలు

తపాలా బీమా పాలసీని వినియోగించుకోండి

గజపతినగరం: తపాలా బీమా పథకాన్ని, పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగిం చుకోవాలని గజపతినగరం సబ్‌డివిజినల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర సూచించారు. స్థానిక పోస్టల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు బీమా సౌకర్యం కల్పించా లనే ఉద్దేశంతో 1995 మార్చి24వ తేదీన పోస్టల్ శాఖ గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీని ప్రవేశపెట్టిందని చెప్పారు. బీమా పాలసీ ప్రవేశపెట్టి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అన్ని పోస్టాఫీసుల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

మిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ జనరల్ ఆస్పత్రిలో ఓ మహిళకు వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. గరివిడి మండలం కోడూరు గ్రామానికి చెందిన కొత్తింటి నారాయణమ్మ అనే 70 ఏళ్ల మహిళ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స నిమిత్తం మిమ్స్ ఆస్పత్రిలో చేరింది. వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమె క్లిష్టమైన హెర్నియాతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వెంటనే ఆస్పత్రి శస్త్రచికిత్స నిపుణులు కేసీటీ నాయక్, కృష్ణచైతన్య బొత్స ఆధ్వర్యంలో సర్జరీ హెచ్ఓడీ ఎన్‌సీఏ నరసింహారావు, మెడికల్ సూపరింటెండెంట్ కె. వెంకటేశ్వరరావు, తదితరులు నారాయణమ్మకు ఇటీవల సర్జరీ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ.. హెర్నియాకు అధునాతన పద్ధతిలో సర్జరీ చేసినట్లు తెలిపారు.

అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి

బొండపల్లి: అర్హులందరికీ ప్రభుత్వం తక్షణమే సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ గజపతినగరం నియోజక వర్గ గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు మహంతి రమణ డిమాండ్ చేశారు.సోమవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా ఒక్కరికి కూడా కొత్తగా పింఛన్ ఇవ్వలేదని ఆరోపించారు. వితంతువులకు కూడా పింఛన్ మంజూరు చేయడం లేదని మండిపడ్డారు.మండలంలో 1,500 మంది వితంతువులు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. అధికారులు తక్షణమే వారికి పింఛన్లు మంజూరు చేయాలని, లేకుంటే వారి పక్షాన పోరాడతామని అన్నారు.

చిరుజల్లులు



కొత్తవలస- విజయనగరం రోడ్డులో కురుస్తున్న వర్షం

కొత్తవలస: మండలంలో సోమవారం చిరుజల్లులు కురిశాయి. దీంతో వాతావరణం చల్లబడింది. కొద్ది రోజులుగా ఎండల తీవ్రతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ చిరుజల్లులు ఉపశమనం కలిగించాయి.

నేడు ఆశీల వేలం పాట

గజపతినగరం: మండల కేంద్రంలో పంచాయతీ రోజువారీ మార్కెట్‌లో ఆశీలు వసూళ్లకు సంబంధించి మంగళవారం వేలం పాట వేయనున్నట్లు పంచాయతీ ఈఓ జనార్దనరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే వేలం పాటకు ఆసక్తి ఉన్న వారు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వేలం పాట జరుగుతుందని స్పష్టం చేశారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని కొండపాలెం మేజర్ పంచాయతీలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించాలని ఎమ్మె ల్యే కిమిడి కళావెంకటరావును ఆ పంచాయతీ కూటమి నాయకులు కోరారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యేను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆక్రమణలను తొలగించి ఆ భూములను అల్లూరి సీతారామ రాజు విగ్రహం(పార్కు), రైతుబజారు ఏర్పాటుకు కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

జోరుగా ఈకేవైసీ



పాచలవలసలో పిల్లల ఈకేవైసీ చేస్తున్న రేషన్ డీలర్

దత్తిరాజేరు: రేషన్ కార్డుల్లో లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియ గ్రామాల్లో జోరుగా సాగుతోంది. తహసీల్దార్ విజయభాస్కర్ ఆదేశాలతో రేషన్ డీలర్లు ఈ ప్రక్రియను చేపడుతున్నారు. మండలంలోని పాచలవలస, తాడేందొరవలస, మరడాం, కొత్తవలస, చినకాద, తదితర గ్రామాల్లో రేషన్ కార్డుల్లోని లబ్ధిదారులైన పిల్లలతో డీలర్లు బయోమెట్రిక్ వేయించి ఈకేవైసీ చేయించారు. పాచలవలస డీలర్, మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పాలూరి అప్పారావు మాట్లడుతూ రేషన్ లబ్ధిదారులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ఎలాంటి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంట ఉత్పత్తులు మన ఆరోగ్యానికి రక్షగా నిలుస్తాయని, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని వినాయకపల్లి సర్పంచ్ గనివాడ తులసి అన్నారు. గనివాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నేతృత్వంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ మనం గతంలో పశువుల గెత్తాన్ని పంటకు ఎరువుగా వాడేవారమని, ఇప్పుడుపూర్తిగా రసాయన ఎరువులు, పురుగు మందులపై ఆధార పడుతున్నామని, దీంతో పంట విషపూరితం అవుతోందని, ఆ పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటున్న మన రోగాల పాలవుతున్నామని వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాల సాగుతో రైతులకు ఖర్చు తగ్గి ఆరోగ్యమైన పంట చేతికి అందుతుందన్నారు. పంటలకు కషాయాలు, జీవన ఎరువులు వినియోగించి ప్రకృతి సేద్యం చేయాలని రైతును కోరారు. అనంతరం డ్వాక్రా సంఘాల సభ్యులతో కలిసి ర్యాలీ చేశారు. వీఏఏ రవి, ఎంటీ కృష్ణ, వీఓఏలు పాల్గొన్నారు.

– శృంగవరపుకోట

సైబర్ నేరాలపై అవగాహన



రోజు రోజుకీ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, వీటిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వల్లంపూడి ఎస్ఐ బి.దేవి సూచించారు. బొద్దాం గ్రామంలో సోమవారం సాయంత్రం ప్రజలు, ఆటో, ట్రాక్టర్ల డ్రైవర్లకు సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతాల వివరాలు, వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. తెలియని నెంబర్ల నుంచి వాట్సాప్ ద్వారా వచ్చే లింక్‌లపై క్లిక్ చేయవద్దని, తెలియని యాప్‌లను వాడవద్దని చెప్పారు. ఆన్‌లైన్‌లో ఏదైనా వస్తువులకు ఆర్డర్లు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ఏఎస్ఐ నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

– వేపాడ

తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఇంటర్మీడియట్ విద్యలో తెలుగు సబ్జెక్టును ప్రథమ భాషగా గుర్తించాలని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చెందిన తెలుగు అధ్యాపకుల బృందం ప్రభుత్వాన్ని కోరింది. గజపతినగరంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. సాయిసిద్ధార్థ కళాశాలలోని సరస్వతీ దేవి విగ్రహానికి వినతిపత్రం అందజేసి మండల కేంద్రంలో ర్యాలీ చేశారు. ఈసందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇంటర్ విద్యలో ద్వితీయ భాషగా ఉన్న తెలుగును ఐచ్ఛిక సబ్జెక్ట్‌గా పరిగణించి భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో మొదటిగా ఏర్పాటైన ఆంధ్ర ప్రదేశ్‌లోనే తెలుగు భాషకు ఈపరిస్థితి కలిగితే తెలుగు భాష మనుగడే ప్రశ్నార్థకమవుతుందని అన్నారు. ఇంటర్‌లో తెలుగు సబ్జెక్ట్‌ను తప్పనిసరిగా ప్రథమ భాషగా గుర్తించి తెలుగు భాష అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడాలని కోరారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ కమిషనర్‌కు వినతిపత్రం పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

– గజపతినగరం

ఏపీఓలకు బదిలీలు

దత్తిరాజేరు: మండల ఉపాధి హామీ ఏపీఓ కె వెంకటప్పలనాయుడుకు ఎస్.కోట బదిలీ అయినట్లు మండల ఉపాధి హామీ కార్యాలయ వర్గాలు సోమవారం తెలిపాయి. ఇక్కడికి గుర్ల నుంచి కామేశ్వరరా వు రానున్నట్లు తెలుస్తోంది. అలాగే ఇక్కడ పని చేస్తున్న టీఏలు త్రినాథ్,చిన్నంనాయుడు, శంకరరావు,చంద్రశేఖర్‌కు కూడా గజపతినగరం, బొబ్బిలి, బొండపల్లి బదిలీ అయ్యిందని తెలిపారు. గజపతినగరం రూరల్: మండల ఉపాధి హామీ ఏపీఓ చప్ప రామారావుకు నెల్లిమర్ల మండలం బదిలీ అయ్యిందని, ఆ కార్యాలయ సిబ్బంది సోమవారం తెలిపారు. బొండపల్లి మండలం నుంచి కృష్ణవేణి ఇక్కడికి బదిలీపై రానున్నట్లు సమాచారం.

ఇళ్ల స్థలాల మంజూరుపై సీపీఐ పోరుబాట

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య

విజయనగరం గంటస్తంభం: కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటివరకు పేదలకు ఇళ్ల స్థలాల మంజూరు, ఇళ్ల నిర్మాణానికి నిధుల మంజూరుకు సంబంధించి ఒక్క అడుగు ముందుకు పడలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి. ఈశ్వరయ్య ఆరోపించారు. ఈ మేరకు సీపీఐ విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ నేతృత్వంలో మార్క్సనగర్ నుంచి పట్టణ పురవీధుల్లో సోమవారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారికి ఆర్థిక సాయం అందించాలన్నారు.అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతితపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, ఎన్.నాగభూషణం, మారూప్స్, నాయకులు అప్పరుబోతు జగన్నాథం, బూర వాసు, వెలగాడ రాజేష్, పొందూరు అప్పలరాజు, ఏఐటీయూసీ నాయకులు పాడుగు రామకృష్ణ, అల్తి మరయ్య, మహిళలు పాల్గొన్నారు.



పోరుబాట కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ డిమాండ్

విజయనగరం గంటస్తంభం: ఆటో, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఏ. జగన్ మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్థూల జాతీయ ఆదాయంలో నాలుగు శాతం రవాణా రంగం నుంచి వస్తోందన్నారు. స్వయం ఉపాధి పొందుతున్న 10 కోట్ల మంది రవాణా రంగ కార్మికుల గొంతు నులిపే విధంగా కేంద్రంలో మోదీ ప్రభుత్వం మోటార్ వాహన చట్టంలో మార్పులు చేసిందని మండిపడ్డారు. అందులో భాగంగానే అగ్రిగ్రేటర్స్ పేరుతో ఒబర్, ఓలా, రాపిడో వంటి కార్పొరేట్ సంస్థలు రవాణా రంగంలోకి ప్రవేశించాయని ఆరోపించారు. ఫీజులు, ఫెనాల్టీలు పెంచుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ 21ని రద్దు చేస్తామని.. ప్రతి డ్రైవర్‌కి సంవత్సరానికి రూ. 15 వేల ఆర్థిక సహాయం చేస్తామని చెప్పిన కూటమి నాయకులు వెంటనే హామీలను అమలు చేయాలని కోరారు. సీఐటీయూ నగర కార్యదర్శి బి రమణ, ఆటో యూనియన్ నాయకులు బి. పాపారావు, భాస్కర్ రావు మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీఏ అధికారులు ఈ చలానాలు విధిస్తుండడంతో ఆటోలు నడపడం కష్టంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆటో రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రామారావు, భాస్కరరావు, ప్రసన్న, ఆనంద్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.